# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 217

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy    సంపాదకులు : కె.భాస్కర్‌రావు    రూ.2.00/- పేజీలు 8    తేది: బుధవారం 09 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి గెలవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కొందరు దింపుడు కళ్లెం ఆశతో 'సర్' పైనా, రిజర్వేషన్లపైనా కోర్టులకు వెళ్లారని విమర్శించారు. ఈరోజు (మంగళవారం) మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ నేతలకు స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహంపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మేయర్లు, చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలని నిర్ణయించామని అన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలనే ఈ ప్రక్రియ చేపట్టామని వెల్లడించారు. బెస్ట్ అభ్యర్థులను నిలిపేలా ప్రతి ఒక్కరం జాగ్రత్త పడాలని సూచించారు. పార్టీకి, ప్రభుత్వానికి నష్టం లేకుండా చూడాలని నిర్దేశించారు. పార్టీకి ప్రభుత్వానికి చెడ్డపేరు లేకుండా ఆభ్యర్థుల ఎంపిక జరగాలని ఆదేశించారు. ఆయా కమిటీల ద్వారా ఈ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ముందుకెళ్దామని సూచించారు. గెలుపే ధ్యేయంగా పనిచేయటంతో పాటు కూటమిగా బ్యాలెన్సింగ్ జరగాలని మార్గనిర్దేశం చేశారు. విశాఖపట్నం నార్త్ మినహా నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమించామని తెలిపారు. రాగద్వేషాలకు అతీతంగా క్షేత్రస్థాయిలోని నాయకులు పనిచేయాలని ఆదేశించారు. పార్టీకి నష్టం కలిగించే ప్రయత్నం చేస్తే సస్పెన్షన్ వేటు పడుతుందని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.




**సమయం ప్రతినిధి:** తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డికి ఊరట లభించింది. వారిద్దరి రిమాండ్‌ను హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు తిరస్కరించింది. ఈ మేరకు ఎమ్మెల్సీలకు బెయిల్ మంజూరు చేసింది. రూ.20 వేల పూచీకత్తుతో రెండు ష్యూరిటీలు సమర్పించాలని వారిని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 17కి వాయిదా వేస్తూ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆజ్ఞాపించింది. న్యాయస్థానం ఆదేశాలతో ష్యూరిటీలు సమర్పించిన తాతా మధు, నవీన్ రెడ్డిని పోలీసులు విడుదల చేశారు. కాగా, తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి మొదలయ్యాయి. సమావేశాల తొలి రోజే అసెంబ్లీ ప్రాంగణం రణరంగాన్ని తలపించింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు రాసిన నల్ల దుస్తులు ధరించి, ప్లకార్డులు పట్టుకున్నారు. దీంతో వారిని పోలీసులు లోపలికి అనుమతించలేదు. స్పీకర్ ఆదేశాల మేరకు చొక్కాలు మార్చుకుని రావాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు అసెంబ్లీ గేటు బయట బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో పోలీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డి మండిపడ్డారు.




**సమయం ప్రతినిధి:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీకి లండన్‌లో విలాసవంతమైన అపార్ట్‌మెంట్లు ఉన్నట్టు వచ్చిన వార్తలు సంచలనంగా మారాయి. మొజ్తాబా ఖమేనీ ఆస్తుల గురించి బ్రిటన్‌కు చెందిన మీడియా సంస్థ ఓ కథనం ప్రచురించింది. ఖమేనీకి లండన్‌లో రూ.400 కోట్ల విలువైన రెండు లగ్జరీ అపార్ట్‌మెంట్లు ఉన్నాయనేది ఆ కథనం సారాంశం. ఇరాన్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. మొజ్తాబా ఖమేనీకి స్వదేశంలో కానీ, విదేశాల్లో కానీ ఎలాంటి ఆస్తులూ లేవని ఇరాన్ రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. లండన్‌లోని కెన్సింగ్టన్ ప్రాంతంలో పాలెస్ గ్రీన్ వద్ద ఉన్న రెండు విలాసవంతమైన పెంట్‌హౌస్‌లు మొజ్తాబా ఖమేనీకి చెందినవని, ఈ ఆస్తుల విలువ సుమారు 36 మిలియన్ పౌండ్ల (దాదాపు రూ.400 కోట్లు)కు పైగా ఉంటుందని 'ది సండే టైమ్స్' పేర్కొంది. వాటిని 2014, 2016లో అలీ అన్సారీ అనే ఇరానియన్ బ్యాంకర్ కొనుగోలు చేసినట్లు వెల్లడించింది. ఈ కథనాలపై లండన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం స్పందించింది (Mojtaba Khamenei property). ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేసింది. మొజ్తాబా ఖమేనీకి తన తండ్రి అలీ ఖమేనీ మాదిరిగానే ఇరాన్‌లోనూ, విదేశాల్లోనూ కూడా ఎలాంటి ఆస్తులూ లేవని స్పష్టం చేసింది. ఆయన నిరాడంబరమైన జీవనశైలి గురించి ఇరాన్ ప్రజలకు బాగా తెలుసని పేర్కొంది.

# భారత జీడీపీ వృద్ధి రేటుతో ప్రపంచ దేశాలకు కొత్త ఆశలు: ప్రధాని మోదీ




**అంతర్జాతీయంగా యుద్ధ భయాలు, వస్తు సరఫరా అవాంతరాలు, ముడిచమురు సంక్షోభం వెంటాడుతున్న తరుణంలోనూ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన ప్రతిభను కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారతదేశం 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటును (GDP Growth) నమోదు చేయడం, ప్రపంచ దేశాలకు నూతన ఆశలను నింపుతోందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ముంబైలో జరిగిన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్' (Global Fintech Fest) మూడో విడత సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు.**

**ముంబై, సెప్టెంబర్ 8 సమయం ప్రతినిధి :** సవాళ్లను అధిగమించిన భారత ఆర్థిక వ్యవస్థ గడిచిన ఏప్రిల్-జూన్ త్రైమాసికం ప్రపంచవ్యాప్తంగా వ్యాపార రంగానికి అత్యంత సవాలుగా మారిందని ప్రధాని అన్నారు. ఇంధనం, నిత్యవసర వస్తువుల సరఫరా వ్యవస్థలపై తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ 7.8శాతం వృద్ధిని సాధించడం మన ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి, సామర్థ్యానికి నిదర్శనమని చెప్పారు.

**జపాన్ ఏజెన్సీ నుంచి రికార్డు రేటింగ్:** దాదాపు మూడు దశాబ్దాల (30 ఏళ్లు) తర్వాత జపాన్‌కు చెందిన ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్‌కు Category సావరేన్ రేటింగ్‌ను కేటాయించిందని ప్రధాని వెల్లడించారు. భారత స్థూల ఆర్థిక స్థిరత్వం, వేగవంతమైన వృద్ధి, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలపై ప్రపంచానికి ఉన్న నమ్మకానికి ఇది ప్రతీక అని పేర్కొన్నారు.

**ఆగని సంస్కరణల రథం:** రాబోయే రోజుల్లో దేశీయ సంస్కరణలు మరిన్ని వేగవంతం అవుతాయని మోదీ స్పష్టం చేశారు. 'ఇండియాస్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్ ఇకపై మరింత వేగంగా దూసుకెళ్తుంది' అని ప్రధాని పునరుద్ఘాటించారు.

**ఫిన్‌టెక్ చరిత్రలో యూపీఐ (UPI) ఒక విప్లవం**

యూపీఐ (UPI) ప్రారంభమై 10 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని ప్రధాని గుర్తుచేసుకుంటూ, భారతదేశ డిజిటల్ చెల్లింపుల ప్రయాణం అద్భుతంగా సాగిందన్నారు. సింగపూర్‌తో భారత యూపీఐ అనుసంధానమైన రీతిలోనే, రాబోయే రోజుల్లో ఇతర విదేశీ చెల్లింపుల వ్యవస్థలతో కూడా యూపీఐని అనుసంధానించడమే తదుపరి లక్ష్యమని తెలిపారు.




**హైదరాబాద్, సెప్టెంబర్ 8 సమయం ప్రతినిధి :** సీఎం రేవంత్‌రెడ్డిపై (CM Revanth Reddy) బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (KTR) అనుచిత వ్యాఖ్యలతో రెచ్చిపోయారు. క్రిమినల్ మనస్తత్వం ఉన్న సీఎం తెలంగాణకు ఉండటం దురదృష్టమని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని, చీర లాగారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి.. అసెంబ్లీ స్పీకర్ కులాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లుగా గజ్వేల్‌కి కాంగ్రెస్ గూండాలను, పోలీసులను పంపించారని ఆగ్రహించారు. రేవంత్‌రెడ్డి మనసులో మాటను ఇద్దరు శాసన సభ సభ్యులు మాట్లాడారని చెప్పుకొచ్చారు.

**కేసీఆర్ ఎందుకు చావాలి..?..**

తెలంగాణను అభివృద్ధి చేసినందుకా..?. సిగ్గులేకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారు. చావు ఎవరికైనా వస్తుంది.. అందరి కంటే ముందు కాంగ్రెస్‌కే ఆ చావు వస్తుంది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చెప్పిన మాట తప్పారు.. హామీల అమలు గురించి అందరూ అడుగుతున్నారు. ఇద్దరిని సస్పెండ్ చేస్తారు అట.. నీ జాగీరు కాదు. అసలు టార్గెట్ కేసీఆర్ కాదు.. మీకు హామీల అమలు మీద టార్గెట్ ఉండాలి. మా నాయకుడు దగ్గరకెళ్తుంటే మమ్మల్ని అరెస్ట్ చేశారు. మేము పోలీసు స్టేషన్‌లో ఉంటే కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారు. తెలంగాణ ప్రజల తరుపున హామీలపై అసెంబ్లీలో అడగమని మా అధినేత చెప్పారని.. కానీ ఈరోజు సమాధానం చెప్పలేక మా ప్రజా ప్రతినిధులపై దాడి చేస్తున్నారు. ప్రజలను రేవంత్‌రెడ్డి లూటీ చేస్తున్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడా.? అని రాహుల్ గాంధీని నిరుద్యోగులు అడుగుతున్నారు. మహిళలకు ఇస్తానన్న రూ. 2500 ఎక్కడా..?. ఆడపిల్లలకు ఇస్తానన్న స్కూటీలు ఏవి..?' అని కేటీఆర్ ప్రశ్నించారు.

# మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల తీరు హేయం

## సీఎం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్షమాపణలు చెప్పాలి: ఎంపీ డీకే అరుణ



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8:** అసెంబ్లీ ఆవరణలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలతో పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత హేయమని బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా ఖండించారు. మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించేందుకు ఎవరు ఆదేశాలు ఇచ్చారని ఆమె ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల మెడ, వెంట్రుకలు పట్టుకొని లాగడం, చీర లాగడం వంటి ఘటనలు జరిగితే వాటిపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని డీకే అరుణ నిలదీశారు. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలను తప్పుగా భావించి క్షమాపణలు కోరాలని చెప్పడంతో పాటు, చర్యలు తీసుకోవాలని సభలో చర్చ జరిగిందని ఆమె తెలిపారు. అదే విధంగా మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపైనా అసెంబ్లీలో చర్చ జరగాలని కోరారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి ఇద్దరూ ఉమ్మడి రాష్ట్రంలో మంత్రులుగా పనిచేసినవారని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా సాటి శాసనసభ్యులను గౌరవించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి ఒక న్యాయం చేయడం సరికాదని పేర్కొన్నారు. అసెంబ్లీలోనే మహిళా ఎమ్మెల్యేలకు గౌరవం లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. మహిళల పట్ల మరింత గౌరవంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇది పార్టీలకు సంబంధించిన అంశం కాదని, ఒక మహిళగా, పార్లమెంట్ సభ్యురాలిగా ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని డీకే అరుణ స్పష్టం చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వెంటనే క్షమాపణలు చెప్పాలని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి

## ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8:** అక్షరాస్యత కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదని, వ్యక్తి సాధికారతకు, కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి అది పునాది అని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అక్షరాస్యత అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పరిషత్ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ మల్లికార్జున్ ఎంటర్‌ప్రైజెస్ మీదుగా కొనసాగి అంబేద్కర్ చౌరస్తా వద్ద ముగిసింది. ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, మహిళలు, ఉపాధ్యాయులు, శారీరక విద్యా ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యతను పెంపొందించడంతో పాటు ప్రతి ఒక్కరిలో విద్య పట్ల ఆసక్తిని పెంచాలని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యను అందిపుచ్చుకొని తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని సూచించారు. "అక్షరం ప్రతి ఒక్కరి హక్కు – విద్య ప్రతి కుటుంబానికి బలం. నిరక్షరాస్యతను నిర్మూలించి, ప్రతి వ్యక్తిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడం మనందరి సామాజిక బాధ్యత" అని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యత పెరిగితే ప్రజల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలు పెరిగి సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

**ప్రతి ఒక్కరూ చదవాలి – ప్రతి ఒక్కరూ ఎదగాలి**

వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో అక్షరాస్యత ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం, నిరక్షరాస్యులను విద్య వైపు ప్రోత్సహించడం, "ప్రతి



ఒక్కరూ చదవాలి – ప్రతి ఒక్కరూ ఎదగాలి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం లక్ష్యంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. వయోజన విద్యాశాఖ, మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో జాతీయ అక్షరాస్యత కార్యక్రమం–ఉల్లాస్ (NILP-ULLAS) కింద ఈ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, డీఈఓ విజయకుమారి, డీఆర్డీఓ నర్సింహులు, వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బొద్దింకలది మూడో స్వాతంత్ర్య సమరమా?

జంతర్ మంతర్ వద్ద పోరాట జ్వాలలు జ్వలించిన జూలై తొలి రోజుల్లో అక్కడకు వెళ్లి యువ ఉద్యమకారులకు సంఘీభావం తెలిపిన రాజకీయవేత్తలలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ప్రథమురాలు. మూడు వారాల అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినప్పుడు 'ఫాసిస్టు, మత దురహంకార ప్రభుత్వాన్ని దాసోహం చేసుకుని భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడినందుకు' ఆ యువ చైతన్యశీలురకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గత పన్నెండు సంవత్సరాలుగా ప్రతిపక్షాలు సాధించలేని దానిని కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) సాధించిందని కూడా ఆమె వ్యాఖ్యానించారు. మహువా మెచ్చుకోలు పూర్తిగా యోగ్యమైనది. విద్యామంత్రి రాజీనామా, పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు హోంమంత్రి సుదీర్ఘంగా గైర్హాజరవడం, బీజేపీ సంస్థాగత పదవులలో ఉన్న పలువురు సీనియర్ నాయకులకు ఉన్నపాటున ఉద్వాసన చెప్పడం, మరీ ముఖ్యంగా నడిరేయి వేళ ప్రధానమంత్రి వీడియో సందేశాలు... ఇవన్నీ, దురహంకారమే సహజ నైజంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం కనీసం తాత్కాలికంగానైనా బలహీనపడి, గందరగోళంలో పడిందని నిరూపించాయి. సీజేపీ యువ పోరాటశీలురు ఇప్పటివరకు సృష్టించిన అపూర్వ చైతన్య ప్రభంజనాన్ని అదే రీతిలో కొనసాగించి తద్వారా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఇత్యాది రాజ్యాంగబద్ధ హామీలను మరింత సంపూర్ణంగా పునరుద్ధరించగలరా? లేదా అనే విషయాన్ని ఇప్పటికిప్పుడు చెప్పలేము. ఏమైనా సీజేపీ ఒక అపూర్వ ఆశాభావాన్ని మొలకెత్తించింది. చరిత్రకారులు జ్యోతిషులు కాదు కనుక, భవిష్యత్తులోకి దృష్టి సారించే బదులు గతకాలంలో జంతర్ మంతర్ ఆందోళనలకు సదృశమైన పోరాటాల వైనాలను అన్వేషించదలచుకున్నాను. ప్రజాజీవితంపై చెరగని ముద్ర వేసిన భారతీయ విద్యార్థి ఉద్యమాలలో ఎన్నదగిన మొట్టమొదటిది 125 సంవత్సరాల క్రితం ప్రజ్వరిల్లింది. బెంగాల్‌లో స్వదేశీ ఉద్యమంలో అది అంతర్భాగంగా ఉంది. చరిత్రకారుడు సుమిత్ సర్కార్ ఇలా వ్యాఖ్యానించారు: బెంగాల్‌లోని ప్రతి జిల్లాకు చెందిన ఎంతో మంది యువజనులు విద్యాభ్యాసానికి కలకత్తాలో ఉన్నారు. వారి ద్వారానే స్వదేశీ ఉద్యమం వంగభూమిలో నలుమూలలకూ దావానలంలా వ్యాపించింది'. 'ఉద్యమ నాయకులు చాలా వరకు డాక్టర్లు, న్యాయవాదులు మొదలైన వృత్తి నిపుణుల కుటుంబాలు లేదా భూస్వామ్య కుటుంబాల నుంచి వచ్చినవారు కాగా కార్యకర్తలు అందరూ విద్యార్థులే. వారిలో అత్యధికులు నవయవ్వనంలో ఉన్నవారే 'అని కూడా సుమిత్ సర్కార్ పేర్కొన్నారు. తదనంతర సంవత్సరాలలో విద్యార్థులు గాంధీ, భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలో వలసపాలన వ్యతిరేక ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమం, పౌర శాసనోల్లంఘనలోనూ పురుష విద్యార్థులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు, జైలుకు వెనుకాడేవారు కాదు. క్విట్ ఇండియా ఉద్యమంలో విద్యార్థి లోకం చరిత్రాత్మక పాత్ర నిర్వహించింది. వేలాది విద్యార్థులతో జైళ్లు నిండిపోయాయి. విద్యార్థినులు, యువ మహిళలు క్రియాశీల పాత్ర నిర్వహించడం క్విట్ ఇండియా ఉద్యమ మరో విశిష్ట చరిత్ర. ఈ సందర్భంగా బొంబాయి విశ్వవిద్యాలయ విద్యార్థిని ఉషా మెహతా పాత్ర గురించి ప్రస్తావించవలసి ఉన్నది. వలస పాలకులపై తిరుగుబాటు చేసిన ఉష అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆ రహస్య జీవితంలో ఆమె నిర్వహించిన 'కాంగ్రెస్ రేడియో' విద్యార్థులను, ప్రజలను సమరోన్ముఖులను చేసింది. చారిత్రక పత్రాల భాండాగారంలో ఉన్న 'కర్ణాటక్ ఇన్ రివోల్ట్' అన్న ఫైలును నేను అధ్యయనం చేశాను. ఇప్పుడు కర్ణాటక రాష్ట్రంగా ఉన్న ప్రాంతాలలో విద్యార్థుల పోరాట పటిమ క్విట్ ఇండియా ఉద్యమ విశేష లక్షణంగా ఉందని ఆ పత్రాలు తెలియజేశాయి. బెల్గాం, గడాగ్, బెంగళూరు, మైసూరు, మంగుళూరు, బీజాపూర్, బళ్లారి, సిర్సి మొదలైన పట్టణాలు, నగరాలలో విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉద్యమంలో పాల్గొన్నారు. బాయ్‌కాట్‌లు, హర్తాళ్‌ల నిర్వహణతో అధికారులకు దడ పుట్టించారు. 23 అక్టోబర్ 1942న ధార్వాడ్‌లో మిస్ షెనోలికర్, మిస్ గుల్వాడి అనే విద్యార్థినులు జిల్లా న్యాయస్థానంలోకి ప్రవేశించి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి అక్కడ ఉన్న జిల్లా జడ్జికి మిమ్ములను ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేస్తున్నామని చెప్పి, కరపత్రాలు పంచి అదృశ్యమయ్యారు.వలసపాలన నుంచి విముక్తి పొందిన అనంతర కాలంలో విద్యార్థులు ఏ విధంగా వ్యవహరించారు? 1968లో ఫిలిప్ జి. ఆల్ట్‌బచ్ అనే సామాజిక శాస్త్రవేత్త సంపాదకత్వంలో 'టర్మాయిల్ అండ్ ట్రాన్సిషన్: హైయర్ ఎడ్యుకేషన్ అండ్ స్టూడెంట్ పాలిటిక్స్ ఇన్ ఇండియా' అన్న పుస్తకం వెలువడింది. ఆల్ట్‌బాచ్ తన ముందుమాటలో ఇలా రాశారు: 'భారత స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థులు కీలకపాత్ర వహించారు. అయితే 1947 అనంతరం విద్యార్థులు నిర్వహించిన ఆందోళనలేవీ రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధం ఉన్నవి కావు. అధిక ఫీజులు, హాస్టల్ సదుపాయాలు నాసిరకంగా ఉండడం మొదలైన సమస్యలపై ఆందోళనలకు దిగారు. వాటితోపాటు వివిధ సాంస్కృతిక కార్యకలాపాలకు సంబంధించిన విషయాలపై కూడా 1960ల్లో భారతీయ విద్యార్థులు ఆందోళనలు చేశారని ఆ పుస్తకం వెల్లడించింది. ఆల్ట్‌బాచ్ పుస్తకం వెలువడిన ఏడాదిలోగానే భారతీయ విద్యార్థులు రాజకీయ ఆందోళనా పథాలలోకి పునఃప్రవేశించారు. 1969లో ప్రారంభమైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులదే కీలక పాత్ర. ఆ ఉద్యమ లక్ష్యం దశాబ్దాల అనంతరం మాత్రమే ఫలించింది. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో విద్యార్థులు నిర్ణయాత్మక పాత్ర వహించిన మూడు ప్రాంతీయ ఉద్యమాలలో ప్రత్యేక తెలంగాణ మొదటిది. మిగతావి అస్సాం ఉద్యమం, ఉత్తరాఖండ్ ఉద్యమం. అస్సాం ఉద్యమానికి నాయకత్వం వహించిన 'ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్' నుంచి ప్రభవించిన అసోం గణపరిషత్ 1985 అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించింది. గత దశాబ్దంలో తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి రావడంలో కూడా విద్యార్థులు, కీలక పాత్ర వహించారు. 'గుజరాత్‌లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి చిమన్ భాయ్ పటేల్ అవినీతిపరుడుగా పేరు పొందారు. విద్యార్థులు ఆయన్ను లక్ష్యంగా చేసుకుని ఆందోళనలకు ఉపక్రమించారు. చిమన్ భాయ్‌ని అధికారంలో కొనసాగిస్తున్నందుకు ప్రధానమంత్రి ఇందిరాగాంధీపై కూడా వారు ధ్వజమెత్తారు. ధరల పెరుగుదల ఆ ఉద్యమానికి ఆజ్యం పోసింది'. గుజరాత్‌లో వలే బిహార్‌లో కూడా విద్యార్థులు ఉద్యమంలో అగ్రగాములుగా ఉన్నారు. బిహార్‌లో విద్యార్థులకు ఒక ప్రముఖ వ్యక్తి నాయకత్వం లభించింది. ఆ ఉదాత్తుడు లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్. 'ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు' ఒక సంవత్సరం పాటు విద్యాభ్యాసానికి విరామం చెప్పాలని విద్యార్థులకు జయప్రకాశ్ విజ్ఞప్తి చేశారు. ఆయన మాటను విద్యార్థులు గౌరవించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వారితో పాటు సోషలిస్టు భావజాల ప్రభావిత విద్యార్థులు కూడా ఆయన నాయకత్వం పట్ల ఆకర్షితులయ్యారు.ప్రస్తుత విద్యార్థి ఉద్యమం ఒక విషయంలో జేపీ ఉద్యమానికి సదృశంగా ఉన్నది. అది నిరంకుశత్వం, వ్యక్తిపూజను వ్యతిరేకించడం. ఈ రెండు అప్రజాస్వామిక ధోరణులకు 1970ల్లో ఇందిరాగాంధీ, ఆమె పార్టీ, ఇప్పుడు నరేంద్ర మోదీ,ఆయన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఏబీవీపీ అప్పుడు పాలక పక్షాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది, ఇప్పుడు అది పూర్తిగా పాలక పక్షం వైపు ఉన్నది. జేపీ ఉద్యమంతో పోలిస్తే ప్రస్తుత ఉద్యమంలో విద్యార్థినులు, యువతులు చాలా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి ఆదర్శవాదం, ధైర్యసాహసాలు 1942నాటి మహిళా ఉద్యమకారుల పోరాట పటిమ, ఉదాత్త ఆదర్శా?లను గుర్తు చేస్తున్నాయి. 1970ల నాటి విద్యార్థి ఉద్యమాల ఉప్పెన రెండో స్వాతంత్ర్య పోరాటంగా ప్రసిద్ధికెక్కింది. అది, మొదటి స్వాతంత్ర్య పోరాట వాగ్దానాలను సంపూర్ణంగా నెరవేర్చేందుకు సంకల్పించింది, కృషి చేసింది. దశాబ్దాల పాటు సాగిన ఏకపార్టీ పాలనకు ముగింపు పలికి ప్రజాస్వామ్యానికి కొత్త ఊపిరి పోయడంలో ఆ రెండో స్వాతంత్ర్యోద్యమం సఫలమయింది. మరోవైపు జేపీ సంపూర్ణ విప్లవ ఉద్యమం హిందుత్వ శక్తులకు చట్టబద్ధత కల్పించింది. ప్రజానీకంలో వాటికొక విస్తృత గుర్తింపు కల్పించింది. ఆ శక్తులే ఆ తర్వాత క్రమేణా తమ ప్రభావ ప్రాబల్యాలను పెంపొందించుకున్నాయి. ప్రస్తుత సీజేపీ విద్యార్థి ఉద్యమకారులు అటు నియంతృత్వాన్ని, ఇటు మత సంకుచిత వాదాలనూ గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. ఇది అభినందనీయమైన విషయం. అంతేకాదు, వారు అంబేడ్కర్, గాంధీ, నెహ్రూను సంయుక్తంగా స్మరించుకోవడం చూస్తుంటే ఆ యువ ఉద్యమకారులు తమ పోరాటాన్ని మూడో భారత స్వాతంత్ర్య సమరంగా భావిస్తున్నట్టు స్పష్టమవుతోంది.

## హన్వాడ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా



రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8: హన్వాడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, ప్రయోగశాలలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను కలెక్టర్ పరిశీలించారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వస్తున్న బాహ్య రోగుల సంఖ్యపై వైద్యాధికారిని అడిగి తెలుసుకుని, బాహ్య రోగుల నమోదు పుస్తకాన్ని పరిశీలించారు.ఆసుపత్రికి వచ్చిన గర్భిణులతో కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారం, పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు.అనంతరం మందుల నిల్వలను పరిశీలించిన కలెక్టర్.. రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులు అందుతున్నాయా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు తగినంతగా అందుబాటులో ఉన్నాయా, ఏవైనా కొరత ఉందా అని ఆరా తీశారు. ప్రస్తుతం మందుల నిల్వలు సరిపడా ఉన్నాయని వైద్యాధికారి ప్రగతి కలెక్టర్‌కు తెలిపారు.తదుపరి ప్రయోగశాలను పరిశీలించిన కలెక్టర్.. అక్కడ నిర్వహిస్తున్న వివిధ రకాల వైద్య పరీక్షలు, రోజువారీగా నిర్వహించే పరీక్షల సంఖ్య, అవసరమైన సౌకర్యాల లభ్యతపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రగతి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

## స్వయంగా చెత్తను తొలగించి ఆదర్శంగా నిలిచిన అధికారి





సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8: మహబూబ్‌నగర్‌లోని మోడ్రన్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తను స్వయంగా తొలగిస్తూ పారిశుద్ధ్య పనుల్లో చురుగ్గా పాల్గొన్నారు.పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించడంతో పాటు పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను కూడా తొలగించారు. అధికారిగా మాత్రమే కార్యక్రమాన్ని పరిశీలించకుండా స్వయంగా పారిశుద్ధ్య పనుల్లో పాల్గొని సిబ్బందికి, విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచాలని సూచించారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే అలవాటును విద్యార్థులు అలవరుచుకోవాలని ఆయన సూచించారు.

## సంక్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్లకు రోబోటిక్ న్యూరోసర్జరీతో చికిత్స




మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 8: సంక్లిష్టమైన మెదడు కణితులకు అత్యంత కచ్చితత్వంతో, సురక్షితంగా శస్త్రచికిత్స నిర్వహించేందుకు రోబోటిక్ న్యూరోసర్జరీ ఆధునిక వైద్య విధానంగా ఉపయోగపడుతుందని యశోద హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపారు.మహబూబ్‌నగర్‌లో యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మేనేజర్ బి. సుదర్శన్ రెడ్డి, రోహిత్ కుమార్ పాల్గొని రోబోటిక్ న్యూరోసర్జరీ, మెదడు కణితులకు అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా విధానాల గురించి వివరించారు. సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్స్‌లో 'రోసా' (ROSA) అనే మెదడుకు ప్రత్యేకమైన రోబోటిక్ శస్త్రచికిత్స సహాయక వ్యవస్థ అందుబాటులో ఉందని తెలిపారు. శస్త్రచికిత్స సమయంలో న్యూరోసర్జన్‌కు నిరంతరం మార్గనిర్దేశం చేస్తూ, మెదడులోని నిర్దిష్ట ప్రాంతాన్ని అత్యంత కచ్చితత్వంతో చేరేందుకు ఇది సహాయపడుతుందని పేర్కొన్నారు. న్యూరోసర్జన్‌కు జీపీఎస్‌లా మార్గనిర్దేశం చేయడం ద్వారా లోతైన మెదడు కణితులను చిన్న రంధ్రం ద్వారా నిర్వహించే కీ-హోల్ శస్త్రచికిత్సలో ఇది ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సంక్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్లకు సురక్షితమైన శస్త్రచికిత్స నిర్వహించడంలో రోబోటిక్ సాంకేతికతతో పాటు ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ, ఇంట్రా ఆపరేటివ్ మానిటరింగ్, న్యూరోనావిగేషన్, ఆధునిక మైక్రోస్కోప్, ఎండోస్కోప్ వంటి సాంకేతిక సదుపాయాలు, వైద్యుల అనుభవం కీలకంగా ఉంటాయని వివరించారు.

**యశోద సెంటర్ ఫర్ న్యూరో ఎండోస్కోపీ**

ముక్కు ద్వారా లేదా కీ-హోల్ విధానంలో మెదడు కణితులు, ఇతర నాడీ సంబంధిత వ్యాధులకు చికిత్స అందించేందుకు యశోద సెంటర్ ఫర్ న్యూరో ఎండోస్కోపీ (వైసీఎన్ఈ) ప్రత్యేక కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. పిట్యూటరీ అడినోమా, క్రానియోఫారింజియోమా, స్కల్ బేస్ మెనింగియోమా, క్రానియోఫారింజియోమా, కొండ్రోసార్కోమా వంటి సమస్యలతో పాటు సీఎస్ఎఫ్ రైనోరియా, స్కల్ బేస్ మరమ్మతులు, స్కల్ బేస్ ఆస్టియోమైలైటిస్ వంటి సమస్యలకు కూడా ఆధునిక చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ట్రైజెమినల్ న్యూరాల్జియా, హెమీఫేషియల్ స్పాజం వంటి సమస్యలకు నిర్వహించే ఎండోస్కోపిక్ మైక్రోవాస్కులర్ డీకంప్రెషన్ న్యూరో ఎండోస్కోపీ విభాగంలో ప్రత్యేకతగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అనుభవజ్ఞులైన న్యూరోసర్జన్లు, అధునాతన వైద్య పరికరాల సమన్వయంతో సంక్లిష్టమైన మెదడు శస్త్రచికిత్సలను మరింత కచ్చితత్వంతో, భద్రతతో నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుందని యశోద హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపారు.

## అక్షరాస్యతే అభివృద్ధికి తొలి మెట్టు

## విద్యతో ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలి




నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 09: అక్షరాస్యతతోనే సమాజంలో చైతన్యం, అభివృద్ధి సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) దేవసహాయం అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న అక్షరాస్యత పక్షోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ (బి) పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ దేవసహాయం అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించేలా సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జెండా ఊపి విద్యార్థుల అవగాహన ర్యాలీని ప్రారంభించారు.పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీపురం చౌరస్తా, అంబేద్కర్ విగ్రహం మీదుగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. విద్యార్థులు అక్షరాస్యత ఆవశ్యకతను తెలియజేస్తూ నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ తిరిగి పాఠశాలకు చేరుకుంది.అక్షరాస్యత పక్షోత్సవాల సందర్భంగా ప్రజల్లో విద్య ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా వయోజనులు కూడా విద్యను అభ్యసించేలా ప్రోత్సహించడం, నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయడం లక్ష్యంగా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కురుమయ్య, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు తిరుపతయ్య, ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ జగదీశ్వర్ రెడ్డి, వయోజన విద్య జిల్లా ఇన్‌చార్జి సందీప్ కుమార్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంతిమ విజయం సత్యానిదే: ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

అసత్యాల ప్రతిధ్వనిని సత్యం జయిస్తుందని ప్రధాని మోదీ తాజాగా వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. అసత్యాల ప్రతిధ్వనుల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కానీ భారత దేశ యువత మాత్రం సత్యమార్గంలో ప్రయాణిస్తోందని చెప్పారు. తప్పుదారి పట్టించే వారు ప్రతి చోటా తారసపడుతూనే ఉంటారని అన్నారు. అంతకుముందు ప్రధాని వడోదరలో రూ.20 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సభకు పెద్ద ఎత్తున హాజరైన గుజరాత్ యువతను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'ఇటీవలే వడోదర, ముంబై మధ్య డబుల్ డెకర్ గూడ్స్ రైలు ప్రారంభమైంది. ఈ రైలు ద్వారా ఒక్క ట్రిప్‌లో 250 ట్రక్కులకు సమానమైన సరకును తరలించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కూడా కొందరు ఎంట్రీ ఇచ్చి విమర్శలు గుప్పిస్తారు. ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తారు. ట్రక్కుల పరిస్థితి ఏమిటని అంటారు. వాళ్లకు గొణిగేందుకు మరో అంశం దొరికినట్టే' అని ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. 2014కు ముందు సరకు రవాణా ప్రత్యేక కారిడార్ నిర్మాణం కిలోమీటరు మేర కూడా ముందుకు సాగలేదని విమర్శించారు.







# కేసీఆర్ చావు కోరడం కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనం

## మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్




సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్: భారత రాష్ట్ర సమితి నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని, ప్రజల ఆదరణను చూసి తట్టుకోలేక ప్రభుత్వం నిరసనలను అణిచివేసేందుకు ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లకుండా పోలీసులను ఉపయోగించి అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించినందుకా కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. రైతుబంధు అమలు చేసినందుకా, రైతులకు సాగునీరు అందించినందుకా, రూ.200గా ఉన్న పింఛన్‌ను రూ.2,000కు పెంచినందుకా, వికలాంగులకు రూ.4,000 పింఛన్ అందించినందుకా, ఇంటింటికీ తాగునీరు అందించినందుకా, ప్రతి జిల్లాకు వైద్య కళాశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేసి పేదలకు వైద్యం అందించినందుకా కేసీఆర్‌ను విమర్శిస్తున్నారో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ చావును కోరుతూ కొందరు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. మనిషి చావును నిర్ణయించేది భగవంతుడు మాత్రమేనని, ఎవరూ మరొకరి చావును కోరుకోవడం సరికాదన్నారు. కేసీఆర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారి మాటలను వారి విజ్ఞతకే వదిలేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని, తెలంగాణ ఏర్పడిన తర్వాతే అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర శాఖలను ఏర్పాటు చేసుకుని రాష్ట్ర అధ్యక్షులను నియమించుకున్నాయని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజల బాగోగులు చూడాలని తాము కోరుతున్నామని తెలిపారు.ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి తెలంగాణ సాధించుకున్నది రాష్ట్ర అభివృద్ధి కోసమేనని, పదేళ్లపాటు రాష్ట్ర అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు. శాసనసభ్యులు చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి స్పందించాలని, లేకపోతే ప్రభుత్వం మాట్లాడిస్తోందనే భావన ప్రజల్లో కలుగుతుందని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ వ్యాఖ్యలపై స్పందించాలని కోరారు.

**ఇచ్చిన హామీలు అమలు చేయాలి: లక్ష్మారెడ్డి**

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. 22ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అంశాలపై ప్రశ్నిస్తారనే భయంతోనే అడ్డుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రజలకు ఏమీ ఇవ్వదనే విషయం ఇప్పటికే అర్థమైందని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే ప్రజలు కోరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పని అనేక కార్యక్రమాలను కూడా అమలు చేసిందని, కాంగ్రెస్ మాత్రం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్ బయటకు వస్తే తమకు రాజకీయంగా బతుకుదెరువు ఉండదనే భయంతోనే ఆయన చావును కోరుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ ఎప్పుడు బయటకు రావాలో ఆయనకు తెలుసని, తప్పకుండా వస్తారని అన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి: ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**

దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల మాదిరిగా తాము ఎవరి చావును కోరుకోవడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి తన పదవీకాలాన్ని పూర్తి చేయాలని, ఆ తర్వాత ఎన్నికల్లో ఆయనపై గెలిచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన విఫలమైందని ప్రజలు తేల్చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు.

**ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి: రాజేందర్‌రెడ్డి**

నారాయణపేట మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ చావును కోరుకోవడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, భూత్పూర్ మాజీ వైస్ చైర్మన్ బస్వరాజ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మహబూబ్‌నగర్ మండల పార్టీ అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బాలరాజు, గిరిధర్‌రెడ్డి, జంబులయ్య, కట్ట రవికిషన్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రాంతాలకు కూడా విభిజీ రామ్ జి చట్టం వర్తింపచేయాలి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు డిమాండ్



అమరచింత : మంగళవారం నాడు అమరచింత మండల కేంద్రంలోని జీఎస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు యస్.అజయ్ అధ్యక్షతన జరగ్గాఆర్ వెంకట్రాములు మాట్లాడుతూప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని పేదలకు ఏడాదికి 12,000 ఇచ్చే నగదుకు తగిన బడ్జెట్ ను కేటాయించాలని డిమాండ్ చేశారు. లిఉపాధి హామీ చట్టం కేవలం గ్రామీణ ప్రాంతాలకే కాకుండా పట్టణ మున్సిపాలిటీ ప్రాంతాలకు కూడా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు ఆదే విధంగా 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీని ఇచ్చిందని తక్షణమే అమలకు పట్టిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. అసైన్డ్ భూములు పోడు భూములు సంబంధించి సాగు చేసుకుంటున్న దళితులు గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సుల ప్రకారం భూమిలేని పేద కుటుంబాలకు ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు భూ పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారుప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. ఆహార భద్రత చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. దేశంలో పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని ఎద్దేవా చేశారు. పెరుగుతున్న నిత్యవసర దరలను నియంత్రించడంతోపాటు పేదలకు రేషన్ షాప్‌ల ద్వారా సబ్సిడీతో నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలని కోరారులి ఉపాధి చట్టం పేరు మార్చి కేంద్రం 90% ఇవ్వాల్సి ఉండగా 60 శాతానికి తగ్గించుకొని రాష్ట్రాలు భరించే 10 శాతం నుండి 40%కు పెంచడంద్వారా దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర చేస్తున్న కుటిలయత్నాలను అడ్డుకునేందుకు రానున్న రోజుల్లో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సమస్యల పై చర్చించేందుకు ఈనెల 18 19 తేదీలల్లో హైదరాబాద్లో రాష్ట్ర కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షులు కే. శంకర్ ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా గండి సాయిబాబు గౌడ్



మహబూబాబాద్, సెప్టెంబర్ 8: తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులుగా గండి సాయిబాబు గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు రామచంద్రయ్య గౌడ్ చేతుల మీదుగా గండి సాయిబాబు గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబు గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ గౌడ సమాజం అభ్యున్నతి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గౌడ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. గౌడ యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా గౌడ సమాజం అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు రామచంద్రయ్య గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు గుండాల మల్లేష్ గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోల్కాపురి శ్రీకాంత్ గౌడ్, జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్‌లకు సాయిబాబు గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కీసర మైనింగ్ క్లస్టర్‌పై కాలుష్య నియంత్రణ చర్యలు ఎక్కడ ?

వేకువ సమయం సెప్టెంబర్ 8 కీసర ప్రతినిధి : మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో వేగంగా విస్తరిస్తున్న మైనింగ్, స్టోన్ క్రషర్ కార్యకలాపాలు ఇప్పుడు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కీసర మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి, బోగారం, చీర్యాల, తిమ్మాయిపల్లి, యాదగిరిపల్లి తదితర గ్రామాల పరిధిలో క్రషర్లు, క్వారీలు, ఆర్‌ఎంసీ ప్లాంట్లు విస్తరించడంతో దుమ్ము, ధూళి, శబ్ద కాలుష్యంపై స్థానికుల్లో ఆందోళన పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నిబంధనలు పాటించని క్రషర్లు, క్వారీలు, మైనింగ్ యూనిట్లపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (TGPCB) అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు డిమాండ్ చేశారు.

**అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటిస్తున్నారా?**

ప్రతి క్వారీ, స్టోన్ క్రషర్, ఆర్‌ఎంసీ ప్లాంట్‌కు పర్యావరణ నిబంధనల ప్రకారం CFE (Consent for Establishment), CFO (Consent for Operation) అనుమతులు ఉండాల్సిందేనని సీఐటీయూ స్పష్టం చేసింది. ముఖ్యంగా అంకిరెడ్డిపల్లి, బోగారం, చీర్యాల పరిసరాల్లోని యూనిట్లకు సంబంధించిన అనుమతులు, వాటి కాలపరిమితి, ఉత్పత్తి సామర్థ్యం, కాలుష్య నియంత్రణ చర్యలను అధికారులు బహిర్గతం చేయాలని కోరింది. పరిశ్రమల వద్ద అనుమతులు, కార్యకలాపాల సామర్థ్యం, పర్యావరణ నిబంధనలకు సంబంధించిన వివరాలతో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేసింది.

**కాగితాలపై నిబంధనలు.. క్షేత్రస్థాయిలో అమలు ఎంత?**

క్రషర్ల నుంచి వెలువడే దుమ్మును నియంత్రించేందుకు వాటర్ స్ప్రింక్లర్లు, డస్ట్ ఎక్స్‌ట్రాక్షన్ సిస్టమ్స్, బ్యాగ్ ఫిల్టర్లు, క్లోజ్డ్ షెడ్లు, బౌండరీ వాల్స్, గ్రీన్‌బెల్ట్ వంటి చర్యలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుందని సీఐటీయూ పేర్కొంది.అయితే ఈ నిబంధనలు వాస్తవంగా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? లేక కేవలం రికార్డులకే పరిమితమవుతున్నాయా? అన్నది తేల్చేందుకు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేసింది.గతంలో నిబంధనలు ఉల్లంఘించిన కొన్ని యూనిట్లపై క్లోజర్ ఆర్డర్లు జారీ చేసిన సందర్భాలు ఉన్నప్పటికీ, తిరిగి కార్యకలాపాలు కొనసాగుతున్నాయా? ఉల్లంఘనలు పునరావృతం అవుతున్నాయా? అనే అంశాలపై కూడా అధికారులు సమగ్ర విచారణ చేయాలని కోరింది.

**ప్రజల ఆరోగ్యం ఎవరి బాధ్యత?**

క్రషర్లు, క్వారీల నుంచి వెలువడే దుమ్ము, ధూళి కారణంగా పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఐటీయూ ఆరోపించింది. రహదారులపై పేరుకుపోయే దుమ్ము, భారీ వాహనాల రాకపోకలు, శబ్ద కాలుష్యం వంటి అంశాలపై కూడా అధికారులు దృష్టి పెట్టాలని కోరింది.పరిశ్రమల కార్యకలాపాలు కొనసాగడం ముఖ్యమా? ప్రజల ఆరోగ్యం ముఖ్యమా? అనే ప్రశ్నను సీఐటీయూ లేవనెత్తింది. పరిశ్రమలకు అనుమతులు ఇచ్చిన తర్వాత వాటి కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ కూడా ప్రభుత్వ శాఖల బాధ్యతేనని పేర్కొంది.

**కార్మికుల భద్రతపై కూడా దృష్టి పెట్టాలి**

క్వారీలు, క్రషర్ యూనిట్లలో పనిచేస్తున్న కార్మికుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఐటీయూ కోరింది. కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, భద్రతా చర్యలు కల్పించడంతో పాటు అర్హులైన కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసింది.

**17కు పైగా క్రషర్లు.. 31కు పైగా క్వారీలు?**

కీసర–చీర్యాల మైనింగ్ క్లస్టర్‌కు సంబంధించి గతంలో ప్రస్తావించబడిన నివేదికల ప్రకారం ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో స్టోన్ క్రషర్లు, క్వారీలు ఉన్నాయని సీఐటీయూ పేర్కొంది. ఈ యూనిట్లన్నింటిపై TGPCB అధికారులు తాజా స్థితిగతులను పరిశీలించి, ఎవరికి CFE ఉంది? ఎవరికి CFO ఉంది? ఎవరి అనుమతుల గడువు ముగిసింది? ఎవరు నిబంధనలు పాటిస్తున్నారు? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరింది.

**స్పందించకపోతే ఉద్యమమే**

కీసర మండలంలోని మైనింగ్ క్లస్టర్‌పై సమగ్ర పర్యావరణ ఆడిట్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న క్రషర్లు, క్వారీలు, ఆర్‌ఎంసీ ప్లాంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ కీసర మండల కమిటీ డిమాండ్ చేసింది. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాలుష్యాన్ని కొనసాగించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేసింది. అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపకపోతే పరిసర ప్రాంతాల ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీఐటీయూ కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు హెచ్చరించారు.






# విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి:జిల్లా ఎస్పీ

**నాయకత్వం నేర్చుకోండి.. సైబర్ నేరాలను అడ్డుకోండి..**
**బాలల భద్రతకు అండగా నిలవండి**
**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, పిరమిడ్స్ ప్రదర్శనలు**
**బాలల రక్షణ ఫోక్సో చట్టాన్ని ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి**
**ప్రతి విద్యార్థి సైబర్ భద్రత రాయబారిగా మారాలి**
**కె.పి.ఎస్‌లో ఘనంగా విద్యార్థుల నాయకత్వ పట్టాభిషేక మహోత్సవం**





**కొత్తకోట, సెప్టెంబర్ 08:** కొత్తకోట మండల కేంద్రంలోని కొత్తకోట పీపుల్స్ హైస్కూల్ (కె.పి.ఎస్.)లో మంగళవారం విద్యార్థుల నాయకత్వ పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, హాజరయ్యారు. పాఠశాలకు చేరుకున్న జిల్లా ఎస్పీ కి కె.పి.ఎస్. పాఠశాల పరేడ్ బృందం ఘన స్వాగతం పలికింది. అనంతరం ఎస్పీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు, అద్భుతమైన పిరమిడ్స్ ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను ఎస్పీ అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ స్ఫూర్తి, క్రమశిక్షణ, బాధ్యతాయుత ఆలోచనా విధానం, సేవాభావం, ఆత్మవిశ్వాసం పెంపొందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్నికైన విద్యార్థులకు జిల్లా ఎస్పీ సునితా రెడ్డి, చేతుల మీదుగా పట్టాభిషేకం నిర్వహించి నాయకత్వ బాధ్యతలను అందించారు. అనంతరం విద్యార్థులందరితో లీడర్‌షిప్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థి దశ అనేది వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్ నాయకత్వానికి పునాది వేసే అత్యంత కీలకమైన దశని నాయకత్వం అంటే కేవలం ఒక పదవి లేదా హోదా కాదని, ఇతరులను ముందుకు నడిపించే బాధ్యతతో పాటు సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండటమే నిజమైన నాయకత్వమని చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యత, ఆత్మ విశ్వాసం, ఇతరులను గౌరవించే తత్వం, సేవాభావం వంటి విలువలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో నేర్చుకునే విద్య కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా, మంచి వ్యక్తిత్వంతో కూడిన బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి ఉపయోగపడాలని అన్నారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి, లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని, వైఫల్యాలను చూసి నిరుత్సాహపడకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని విజయాన్ని సాధించాలని ఎస్పీ సూచించారు. భవిష్యత్తులో దేశానికి, సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదిగి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.అదేవిధంగా ప్రస్తుత కాలంలో విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని ఎస్పీ తెలిపారు. అనుమానాస్పద లింకులు, తెలియని యాప్‌లు, ఆన్‌లైన్ పెట్టుబడి ఆఫర్లు, సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ప్రకటనలు పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఫోన్ చేసి లేదా మెసేజ్ ద్వారా ఓటీపీ, ఏటీఎం/బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ప్రముఖుల పేర్లు, ఫోటోలు ఉపయోగించి సోషల్ మీడియాలో వచ్చే పెట్టుబడి ఆఫర్లను ధృవీకరించకుండా నమ్మవద్దని సూచించారు. పాఠశాలలో నేర్చుకున్న సైబర్ భద్రత అంశాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలకు తెలియజేసి వారిలో కూడా అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి విద్యార్థి తన కుటుంబానికి, గ్రామానికి, సమాజానికి "సైబర్ భద్రత రాయబారి"గా మారాలని ఎస్పీ పిలుపునిచ్చారు.బాలల భద్రత విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. పిల్లలపై లైంగిక వేధింపులు, దుర్వినియోగం, అనుచిత ప్రవర్తన వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని పిల్లలకు "గుడ్ టచ్–బ్యాడ్ టచ్"పై అవగాహన కల్పించడంతో పాటు, తమకు ఎదురయ్యే అసౌకర్యకరమైన లేదా అనుమానాస్పద పరిస్థితులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలతో వెంటనే పంచుకునే ధైర్యాన్ని పెంపొందించాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాలను నిరోధించేందుకు అమలులో ఉన్న ఫోక్సో చట్టం (POCSO Act) గురించి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని అన్నారు. బాలల రక్షణకు సంబంధించిన అంశాల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పిల్లల భద్రతకు ముప్పు కలిగించే ఘటనలు కనిపించినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాలల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు.. కుటుంబం, పాఠశాల, సమాజం మొత్తం కలిసి నిర్వహించాల్సిన బాధ్యతని ఎస్పీ పేర్కొన్నారు. విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను కూడా గౌరవించాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీమతి కృష్ణవేణి, చైర్మన్ శ్రీ ఎద్దుల రాజవర్ధన్ రెడ్డి, డైరెక్టర్ శ్రీ చంద్రహాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం జిల్లా ఎస్పీ సునితా రెడ్డి, ఐపీఎస్ను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ ఓ.డి. రమేష్, కొత్తకోట ఎస్సై విక్రమ్, శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు, పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి, చైర్మన్ ఎద్దుల రాజవర్ధన్ రెడ్డి, డైరెక్టర్ చంద్రహాస్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం

**చిన్న చింతకుంట మండలంలో SC సెల్ అధ్యక్షులు పి. నాగరాజు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం**



చిన్న చింతకుంట: తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై BRS ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ చిన్న చింతకుంట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, స్పీకర్ గారిపై తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దేవరకద్ర శాసనసభ్యులు శ్రీ జి. మధుసూదన్ రెడ్డి గారి ప్రత్యేక ఆదేశాల మేరకు, అలాగే డీసీసీ (DCC) పిలుపు మేరకు చిన్న చింతకుంట మండల కాంగ్రెస్ కమిటీ మరియు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. BRS ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి ఆయన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి. నాగరాజు – SC సెల్ అధ్యక్షులు వెంకటేష్ – మండల అధ్యక్షులు, సురేందర్ రెడ్డి – జిల్లా ప్రధాన కార్యదర్శి, వెంకటేష్ – మాజీ దేవరకద్ర నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిమూద్ – మాజీ కో–ఆప్షన్ సభ్యులు, ఖాజా మైనుద్దీన్ – మైనార్టీ అధ్యక్షులు, ఎస్.శేఖర్,గుర్రం ప్రతాప్, బాలవర్ధన్, గూడూరు శేఖర్, సురేష్, తెలుగు వెంకటేష్, చిరంజీవి, ఆనంద్, శాంసన్ ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామాల SC సెల్ కమిటీ అధ్యక్షులు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీ అవగాహన ర్యాలీ

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 08: ప్రపంచ ఫ్రిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణ హాజరై జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. నాగర్ కర్నూల్ పాత కలెక్టర్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగింది ఫిజియోథెరపీ ప్రాధాన్యత గురించి నినాదాలు ఇస్తూ ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీలో పారామెడికల్ కళాశాల విద్యార్థులు విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పలువురికి సన్మానం చేశారు కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, తెలంగాణ ఫిజియోథెరపీ వెల్ఫేర్ అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి ఎన్.సుమంత్ కార్యదర్శి డాక్టర్ ఎన్ సృజన, కోశాధికారి డాక్టర్ అంజలి డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

## అహంకార ధోరణిని సభ్యులు విడనాడాలి : సభ కొందరిది కాదు అందరిదీ

హైదరాబాద్ : శాసనమండలిలో మంత్రి వాకిటి శ్రీహరి సభ్యుల ను ద్వేషించి చేసిన ప్రసంగం లోని ముఖ్య అంశాలు ఎలా ఉన్నాయిఉభయ సభలపై బీఆర్ఎస్ దురంహకార ధోరణి వీడాలి. ఈ సభ కొందరిది కాదు అందరిదీ.స్పీకర్ పై జరిగిన దాడిపై చర్చ జరుగాలి. నాటి నుంచి నేటి వరకు పెత్తందార్ల పోకడలు ఇంకా కొనసాగడం దురదృష్టకరం పదే పదే స్పీకర్ ను అవమానించేలా మాట్లాడుతున్నారు. నేను తొలిసారి ఏమ్మెల్యేగా అసెంబ్లీకి వచ్చాను.మాకు మాట్లాడే అవకాశం లేకుండా అడ్డుపడుతున్నారు. స్పీకర్ పొడియాన్ని చుట్టుముట్టి అడ్డుపడుతున్నారు.తాత మధు మాటల వెనుక తప్పుడు ఆలోచన విధానం దాగి ఉంది.ఇంకా అణచివేత ధోరణులు కొనసాగడం బాధాకరం ఇలాంటి విధానాలు అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగాన్ని అవమానిచడమే జడ్పీ ఫ్లోర్ లీడర్ గా ఉన్నప్పుడు 29సార్లు గృహ నిర్భంధం చేశారు.తొమ్మిదేళ్ల పాలనలో తీవ్ర నిర్భంధం కొనసాగింది.రూల్ బుక్ ప్రకారమే సభను నిర్వహిస్తున్నారు.నాడు బుక్ ను చింపినందుకే కోమటిరెడ్డి, సంపత్ కుమార్ లను సస్పెండ్ చేసారు. ఏమ్మెల్యేలు సబితా, సునీతాలక్ష్మారెడ్డిపై జరిగిన దాడిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను. స్పీకర్ పై జరిగిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలి.



## జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల జిల్లా సమీకృత కలెక్టరేట్ (IDOC) ప్రాంగణంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 'ఉల్లాస్' (నవభారత్ సాక్షరతా కార్యక్రమం – ULLAS) కింద అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరాస్యత ప్రాముఖ్యత మరియు ఉల్లాస్ పథకంపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ?ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ కర్రెప్ప మాట్లాడుతూ... నిరక్షరాస్యతను నిర్మూలించి, ప్రతి పౌరుడికి మౌలిక, డిజిటల్ మరియు ఆర్థిక అక్షరాస్యతను అందించడమే 'ఉల్లాస్' ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చదువుకు వయస్సుతో నిమిత్తం లేదని, ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారి సమాజ పురోగతికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.




**పాల్గొన్న ముఖ్యులు:** ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్లు కర్రెప్ప, ప్రసాద్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (BSG) కార్యదర్శి G. ప్రశాంతకుమార్, స్కౌట్ మాస్టర్ కృష్ణకుమార్, ST హాస్టల్ వార్డెన్ పవన్ కుమార్ పాల్గొనగా, మెప్మా (MEPMA) తరఫున ADMC G. వెంకటేశ్వర్లు, కో–ఆర్డినేటర్ వీణ నిజాముద్దీన్, T. మహాలక్ష్మి మరియు మెప్మా రిసోర్స్ పర్సన్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన ర్యాలీని విజయవంతం చేశారు.

# శ్రీ శ్రీ శ్రీ జమ్ములమ్మ అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

**ఆలయ ఈవో, వేద బ్రాహ్మణులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే దంపతులకు ఘనస్వాగతం**
**శ్రీ జమదాగ్ని సమేత శ్రీ శ్రీ శ్రీ జమ్ములమ్మ అమ్మ వారి కళ్యాణోత్సవము**
**ప్రత్యేక పూజలకు లిహాజరైన ఎమ్మెల్యే దంపతులు , ఎమ్మెల్యే తనయుడు దంపతులు**





గద్వాల : గద్వాల జిల్లా కేంద్రంలోని జమ్మిచేడు శ్రీ శ్రీ శ్రీ జమ్ములమ్మ పరశురాముడు స్వామి దేవాలయంలో శ్రీ శ్రీ శ్రీ జమదగ్ని సమేత శ్రీ శ్రీ శ్రీ జమ్ములమ్మ అమ్మ వారి 6వ వార్షికోత్సవలికళ్యాణోత్సవము సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే దంపతులు శ్రీమతి & బండ్ల జ్యోతి కృష్ణ మోహన్ రెడ్డి ఎమ్మెల్యే తనయుడు దంపతులు అమ్మవారికి సాంప్రదాయం ప్రకారం పట్టు వస్త్రాలను, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. దేవాలయంలో ఎమ్మెల్యే దంపతులకు, ఎమ్మెల్యే తనయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులు శ్రీమతి & శ్రీ బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి వేద పండితులు చే సాంప్రదాయబద్ధంగా శ్రావణమాసం చివరి మంగళవారం పురస్కరించుకొని పచ్చటి పందిరిలో లోక జనని జమదగ్ని సమేత శ్రీ జమ్ములమ్మ అమ్మ వారి కళ్యాణోత్సవము కళ్యాణం కమనీయం మంగళ వాయిద్యాలతో నిర్వహించడం జరిగినది.ఎమ్మెల్యే దంపతులకు కి , ఎమ్మెల్యే తనయుడు దంపతులకుకి ఆలయ ఈఓ శాలువాతో సత్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నడిగడ్డ ప్రజల ఇలవేల్పు అయిన శ్రీ శ్రీ శ్రీ జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం 6వ వార్షికోత్సవంలో గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగినది. జమ్ములమ్మ అమ్మవారి దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు తమ మొక్కలను తీర్చుకోవడానికి అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రతి సంవత్సరం జనవరి నుండి జూన్ వరకు ఈ జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకుని విచ్చేస్తుంటారు వారికి అన్ని సౌకర్యాలను కల్పిస్తూ భవిష్యత్తులో జమ్ములమ్మ అమ్మవారి పుణ్యక్షేత్రంగా ఏర్పడే విధంగా కృషి చేస్తామని తెలిపారు. జాతరకు, కళ్యాణోత్సవము వచ్చే భక్తులకు అన్ని వసతులను కల్పించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం, నడిగడ్డ ప్రాంతంలో రైతులకు సకాలంలో వర్షాలు పండాలి. రైతుల పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర రావాలి, రైతు అభివృద్ధి చెందాలి, వ్యాపార వ్యవహార, విద్యా వైద్య రంగాలలో కూడా సి.ఎం రేవంత్ రెడ్డి గారి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలి. అదేవిధంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని కోరుకోవడం జరిగినది. దేవాలయ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కురువ హనుమంతు, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సరోజమ్మ రమేష్ నాయుడు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్, మాజీ ఎంపీపీ విజయ్ , మాజీ ఛైర్మన్‌లు సతీష్, బోయ వెంకట రాములు, కౌన్సిలర్స్ లత వంట భాస్కర్, వేదవతి వెంకటేశ్వర రెడ్డి, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ మురళి, నరహరి శ్రీనివాసులు, నరహరి గౌడు, సీనియర్ నాయకులు ఆలయం కమిటీ మాజీ డైరెక్టర్స్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాటలను వక్రీకరించి ప్రచారం

**బడుగు వర్గాల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై మీ రాజకీయ కుట్ర సాగదు**
**షాద్ నగర్ కాంగ్రెస్ నేతలు బాబర్ ఖాన్, రఘునాయక్**



షాద్‌నగర్ : అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్ లోనే బందీ అయిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీరును ఎండగడుతూ, అదేవిధంగా దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల బీఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ ఫామ్ హౌస్ ఎదుట చావు డప్పు కొడతామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెప్పడాన్ని కొన్ని సోషల్ మీడియా సంస్థలు బిఆర్ఎస్ నాయకులు కుమ్మక్కై రాజకీయంగా వీర్లపల్లి శంకర్ ను దెబ్బ తీయడానికి చేస్తున్న నాటకాలు సాగబోవు అని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ గిరిజన ఆదివాసి కోఆర్డినేటర్ రఘునాయక్ లు స్పష్టం చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వారు పేర్కొంటూ.. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలను కొందరు గులాబీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో తప్పుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. దౌర్జన్యాలకు గుండా గిరికి కేరాఫ్ అడ్రస్ గా మారుతున్న గులాబీ శ్రేణుల ఆగడాలు రాష్ట్రంలో మితిమీరి పోయాయని పేర్కొన్నారు. మహిళా ప్రజాప్రతినిధులను అడ్డం పెట్టుకుని నిన్న అసెంబ్లీ గేటు ఎదుట గులాబీ ప్రజాప్రతినిధులు సిగ్గులేకుండా పోలీసులపై దాడికి పాల్పడ్డారని మహిళా పోలీసుల పట్ల విచక్షణ రహితంగా వ్యవహరించారని పేర్కొన్నారు. హరీష్ రావు, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వ్యవహరించిన తీరు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పింకిల బలుపు చర్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడదని హెచ్చరించారు. ఫామ్ హౌస్ ఎదుట దళితులు చౌడపు మోగిస్తారని చెప్పే క్రమంలో కొందరు ఆ వీడియోలను రాద్ధాంతం చేస్తూ తప్పుడు మాటలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అంటగడుతూ విమర్శలు చేస్తున్నారని కొందరు గులాబీ శ్రేణులు తమ సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ట్రోల్ చేస్తూ ఎన్నో మాటలు చెబుతున్నారని అది వారి విచ్చక్షణకే వదిలి వేస్తున్నామని అన్నారు. గురివింద చందంగా వ్యవహరిస్తున్న బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఒక బడుగు బలహీన వర్గాలకు చెందిన బిడ్డ వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే అయితే కొంతమంది జీర్ణించుకోలేక ఆయన అభివృద్ధిని అడ్డుకునేందుకు లేనిపోని నిందలు మోపి విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఇవి సమంజసం కాదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గొప్పతనాన్ని నియోజకవర్గంలో అడిగి తెలుసుకుంటే సరిపోతుందని ఎవరు ఏ పార్టీ ఘనులు ఏపాటి వారో ప్రజలకు తెలుసని అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై అవకుల సేవకులు వెళితే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. శంకర్ దిష్టిబొమ్మలు తగలబెట్టడం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేయడం వల్ల ఒరిగేది ఏమీ లేదని పెంకిల బలుపు చర్యలకు భయపడమని వాస్తవాలు ప్రజలకు తెలుసని అన్నారు. గులాబీ శ్రేణుల హైరానాను చూసి సిగ్గు జాలి వేస్తుందని అన్నారు. రాబోయే కాలంలో తగిన గుణపాటాలు తప్పవని భవిష్యత్తు ఎవరికి ఏం జరుగుతుందో కాలమే నిర్ణయిస్తుందని వారు అన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నేతలు



ఆత్మకూరు: తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఈరోజు ఆత్మకూర్ ఎంపీడీవో ఆఫీసులో 78 కళ్యాణ లక్ష్మి చెక్కులు షాదీ ముబారక్ చెక్కులు లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎండి రహమతుల్లా ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్ పర్సన్ జి నాగమణి ఆత్మకూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు వనపర్తి జిల్లా డిసిసి కార్యదర్శి తులసి రాజ్ యాదవ్ ఆత్మకూరు మాజీ మండల అధ్యక్షులు రాయచూర్ పరమేష్ ఆత్మకూర్ టౌన్ అధ్యక్షులు ఈర్లదిన శ్రీనివాసులు ఆత్మకూర్ మండల అధ్యక్షులు చీ. నాగేశ్వర్ ఆత్మకూరు ఆత్మకూరు మున్సిపాలిటీ కౌన్సిలర్లు వివిధ గ్రామ సర్పంచులు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అదేవిధంగా కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన ఆందోళనలు..

**కేసీఆర్ చావు కోరిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనలు**
**అంజయ్య యాదవ్ పిలుపుతో నియోజకవర్గ వ్యాప్తంగా భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు**




షాద్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావు కోరేలా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు మేరకు షాద్‌నగర్ నియోజకవర్గవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గంలోని వివిధ మండల కేంద్రాలు, గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మలను దహనం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ వ్యాఖ్యలను ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేసీఆర్‌పై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలంగాణ ప్రజల మనోభావాలను కించపరచడమేనని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే హుందాగా వ్యవహరించాలని, చేసిన వ్యాఖ్యలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# హామీలు అడిగితే అక్రమ అరెస్టులా?

# మహిళా ఎమ్మెల్యేలను అవమానించిన రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి




వనపర్తి : అసెంబ్లీ సాక్షిగా నిన్న బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ అని ప్రజాస్వామ్యంలో చీకటిరోజు అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. అక్రమంగా అరెస్టు చేసిన ఎం.ఎల్. సిలు తాత మధుని,నవీన్ రెడ్డి ని బేషరతుగా విడుదల చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి మహిళల చేత ప్రజాస్వామ్యాన్ని,రాజ్యాంగ విలువలను కాపాడాలని మహిళల చేత వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6గ్యారంటీలు,13డిక్లరేషన్లు,420హామీలు 100రోజులలో అమలు చేస్తామని మాట తప్పినందుకు నల్ల దుస్తులతో నిరసన వ్యక్తం చేయడానికి అసెంబ్లీకి వెళుతున్న ఎమ్మెల్యేలపై,మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి,సునీతా లక్ష్మారెడ్డి పై దాడి చేసి గాయపరచడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని దుయ్యబట్టారు.రాజ్యాంగం పుస్తానికాన్ని చేతపట్టుకొని రాహుల్ గాంధీ,ప్రియాంకా గాంధీ పార్లమెంట్లో నిరసన తెలియజేయవచ్చు కానీ మేము చేస్తే తప్పా అని నిలదీశారు.ఎమ్మెల్యేలను సభలోకి రానీయకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు.ప్రతిపక్షం సభలో ప్రభుత్వ బండారం బయట పెడుతుందని జడిసి సభ బయటనే అడ్డుకోవడం ఈ ప్రభుత్వానికి చెల్లిందని అన్నారు.మహిళా ఎమ్మెల్యేలను,రెండు సార్లు మంత్రులుగా చేసిన అనుభవం ఉన్నా అవమానించిన తీరు దుశ్శాసన పర్వాన్ని తలపిస్తోందని వెంటనే రేవంత్ ప్రభుత్వం మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.ఇంతియాజ్ ఇసాక్ మాట్లాడుతూ. నిత్యం మహిళా పక్షపాతి అని చెప్పుకునే రేవంత్ మహిళల ఉసురు తగిలి పతనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రజల నుండి నిరసన వస్తున్న నిరసనలు తట్టుకోలేక రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్య ఖూనికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. క్షమాపణ చెప్పే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## తీన్మార్ మల్లన్న వాక్యాలపై పోలీసులకు ఫిర్యాదు



నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 8: తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ రెడ్డి సామాజిక వర్గంపై చేసిన అనుచిత వాక్యాలను నిరసిస్తూ మంగళవారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ వెంకటరెడ్డికి ఫిర్యాదు అందజేయడం జరిగినది చట్టంపై గౌరవంతో పోలీసులను ఆశ్రయించాము రెడ్డి సామాజిక వర్గాన్ని ఉద్దేశించి చేసిన వాక్యాలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఈ వ్యాఖ్యలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు సమాజంలో ఏ వర్గానికించపరిచే విధంగా వాక్యాలు ఎవరు కూడా చేయడం సరికాదని వారు పేర్కొన్నారు కార్యక్రమంలో రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండకింది మాధవరెడ్డి జిల్లా అధ్యక్షులు బంక మోహన్ రెడ్డి, మొసలి శ్యాంప్రసాద్ రెడ్డి, నాయకులు, విజయేందర్ రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శేఖర్ రెడ్డి తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## తిమ్మప్ప గౌడ్ మృతదేహానికి సర్పంచ్ రాముడు నివాళి



సమయం ప్రతినిధి: గద్వాల జిల్లా జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని చర్ల గార్లపాడు గ్రామానికి చెందిన లడ్డు తిమ్మప్ప గౌడ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ జి. రాముడు వెంటనే మృతుడి స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తనవంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటన్న గౌడ్, ఎన్. రామాంజనేయులు, పెద్ద ఆంజనేయులు, మోహన్ గౌడ్, ఎర్రన్న, గంప వెంకట్రాములు, జమ్మన్న, వార్డు నెంబర్ కుమ్మరి తిమ్మన్న పాల్గొన్నారు.

# 'కూలిన' జవాబుదారీతనం



సమయం ప్రతినిధి: దక్షిణ ఢిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో ఐదు అంతస్థుల పెయింగ్ గెస్ట్ హాస్టల్ భవనం కుప్పకూలి, పలువురు విద్యార్థులు దుర్మరణం పాలవడం మనసులు కలచివేస్తున్నది. యాభైయేళ్ళనాటి భవనానికి బేస్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులు చేపట్టడంతో అది పేకమేడలాగా కుప్పకూలింది. అప్పటికే వర్షాలకు తడిసిముద్దయి ఉన్న ఈ భవనం బేస్‌మెంట్‌లోకి నీరు కూడా చేరివున్న స్థితిలో, నిపుణుల పర్యవేక్షణ లేకుండా రిపేర్లు చేయడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందంటున్నారు. రాష్ట్రపతి, ప్రధాని సహా పెద్దలంతా ఈ ప్రమాదం మీద కూడా ఆశ్చర్యాన్నీ, ఆవేదననూ ప్రకటించారు. బాధిత కుటుంబీలకు సానుభూతి తెలియచేశారు. ప్రమాదం జరిగిన తరువాత మనదేశంలో సకల వ్యవస్థలూ స్పందించే తీరు, వేగం ఆశ్చర్యం కలిగిస్తూనే ఉంటుంది. ఏకంగా పదిపోలీసు బృందాలు, మూడు రాష్ట్రాలను జల్లెడపట్టి, రాజస్థాన్‌లో దాక్కున్న ఈ భవనం యజమానిని ఢిల్లీ లాక్కొచ్చాయి. ఆయన సహా కొందరు కుటుంబీలను సైతం అరెస్టుచేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్రంగా స్పందిస్తూ మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు. సౌత్ జోన్ డిప్యూటీ కమిషనర్ సహా ఐదుగురు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) అధికారులు సస్పెండ్ అయ్యారు. అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలపై ఇకపై 'జీరో టాలరెన్స్' విధానం అమలవుతుందట. అంతేనా? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా ఉండేందుకు ఢిల్లీలోని అన్ని ప్రైవేటు పీజీ భవనాలకు స్ట్రక్చరల్ ఆడిట్ తప్పనిసరి చేస్తున్నట్లు కూడా ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. హాస్టల్ భవనాల నిర్మాణవేగాన్ని పెంచవలసిందిగా తమ అనుబంధ కళాశాలలకు ఢిల్లీ యూనివర్సిటీ వీసీ ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ హైకోర్టు కూడా ఈ ప్రమాదఘటనపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చుతూ, నగరంలోని అన్ని ప్రైవేటు పీజీ భవనాల్లో విద్యార్థుల భద్రత మీద వారంలోగా నివేదిక ఇవ్వాలని కేంద్రానికీ, ఢిల్లీ ప్రభుత్వానికీ, మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసులు ఇచ్చింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కూడా బీజేపీ అధీనంలోనే ఉన్నందున ఈ ఘటనను ట్రిపుల్ ఇంజన్ సర్కారు వైఫల్యంగా కాంగ్రెస్ అభివర్ణిస్తోంది. ఢిల్లీ పీజీ హాస్టల్ వ్యాపారం అంతా బీజేపీ నాయకులు, వారి మద్దతుదారుల అధీనంలో నడుస్తోందని ఆప్ విమర్శిస్తోంది. ఇటువంటి ఘోరాలు జరగ్గానే వ్యక్తులు, వ్యవస్థలు ఎలా ఉలిక్కిపడతాయో గతంలోనూ చూసిందే. ఎంతటివారినైనా వదిలేది లేదని నాయకులు హామీ ఇవ్వడం నుంచి, న్యాయస్థానాలు వాపోవడం వరకూ అంతా వింటున్నదీ కంటున్నదే. ఢిల్లీ 'ప్రమాదాల' జాబితాలోకి ఇప్పుడు సత్యనికేతన్ ఘటన కొత్తగా వచ్చిచేరింది అంతే. దీనికిముందు ఒక హాస్టల్ భవనం మునిగిపోవడం నుంచి, ఒక గెస్ట్‌హౌస్ తగలబడిపోవడం వరకూ అనేకం చూశాం. ఆరు గదులకు అనుమతి తీసుకొని, పాతిక గదుల్లో జనాన్ని నింపి, బేస్‌మెంట్లో రెస్టారెంట్ నిర్వహించిన కారణంగా, ఆ ఐదంతస్తుల భవనం అగ్నికి ఆహుతై విదేశీయులతో సహా పలువురు విద్యార్థులు సైతం ప్రాణాలు పోగొట్టుకున్న మాల వీయనగర్ విషాదం మూడునెలల క్రితమే జరిగింది. దానికి సరిగ్గా మూడురోజుల ముందే, దక్షిణ ఢిల్లీలోని సాకేత్ మెట్రోస్టేషన్ సమీపంలోని భవనం కూలి పలువురు విద్యార్థులు మరణించారు. వీరంతా పొరుగున ఉన్న కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతూ ఈ హాస్టల్‌లో ఉంటున్నవారు. రాకపోకలకు ఒకేమార్గం ఉన్న ఈ భవనం ఎత్తును అక్రమంగా పెంచుతున్నారని విద్యార్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఒకపక్క పైన బరువు పెంచి, మరోవైపు బేస్‌మెంట్‌లో సంప్ విస్తరణకోసం జరిపిన తవ్వకాలు దాని పునాదినే బలహీన పరచాయి. ఢిల్లీలో గత మూడేళ్ళలో వెయ్యికి పైగా భవనాలు వివిధ కారణాలవల్ల కూలినట్టు నివేదికలు చెబుతున్నాయి. విషాదం జరిగిన ప్రతీసారి ప్రభుత్వం ఏవో చర్యలు ప్రకటిస్తుంది, ఎవరినీ క్షమించేది లేదని, రక్షించేది ఉండదని అంటుంది. భద్రమైన భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తుంది. కానీ, మరో విషాదం జరిగేవరకూ ఊపిరిబిగబట్టి ఎదురుచూడటం వినా జనం చేయగలిగిందేమీ లేకపోతోంది. భద్రంగా లేని భవనాలు, అక్రమ నిర్మాణాలు, చట్టవిరుద్ధ వ్యాపారాలతో ఢిల్లీ ఒక్కటే కాదు, దేశంలోని నగరాలన్నీ వెలుగుతున్నాయి. దీనిని పర్యవేక్షణ లోపంగా చూడటం కంటే, మొత్తం నియంత్రణ వ్యవస్థ కుప్పకూలిందనడం సమంజసం. అవినీతి ఆకాశాన్ని అంటుతున్నదని, జవాబుదారీతనం మటుమాయమైందనీ తెలియచెబుతాయి.

## వీరన్నపేట్ నీలకంఠేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి(MSR), ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్



మహబూబ్‌నగర్ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీరన్నపేటలో వేంచేసియున్న శ్రీ నీలకంఠేశ్వర స్వామి రథోత్సవ వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్ శ్రీ మారేపల్లి సురేందర్ రెడ్డి (MSR) మహబూబ్‌నగర్ పట్టణాభివృద్ధి సంస్థ (ముడా) చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అర్చనలు చేసిన అనంతరం, భక్తుల జయజయధ్వనాల నడుమ రథాన్ని లాగి వేడుకలను ప్రారంభించారు."శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారి కృపాకటాక్షాలు మహబూబ్ నగర్ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు సమాజంలో సోదరభావాన్ని, శాంతిసౌఖ్యాలను పెంపొందిస్తాయి. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో తులతూగాలని భగవంతుడిని ప్రార్థించాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్ కుమార్, రఘు, మద్దూరి రాఘవేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, నాయకులు, మరియు పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తజనం స్వామివారి దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## "రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాలి.. అనుచిత వ్యాఖ్యలను సహించేది లేదు!"



ఊట్కూర్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ గారిపై తాత మధు ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ఊట్కూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. "ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. అనుచిత వ్యాఖ్యలు చేసిన తాత మధుపై తగిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. తాత మధు ఎమ్మెల్సీ పదవిపై అసెంబ్లీలో తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆయనను BRS పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై స్పందించని పక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. "దౌర్జన్యాలతో ప్రజాస్వామ్య స్వరాన్ని అణచలేరు.. ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది!"టీఆర్ఎస్ కార్యకర్తల దౌర్జన్యాలు, బెదిరింపులను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే తమ నిరసనను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రెస్‌మీట్‌లో టౌన్ అధ్యక్షులు కొక్కు లింగం, కొక్కు శంకర్, కోరం మహేష్ రెడ్డి -యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, మైనార్టీ మండల అధ్యక్షులు జలాల్, వార్డు సభ్యులు కొక్కు మల్లేష్, పూజారి నారాయణ, జమ్మన్నవుల నర్సింలు, చందు, అస్మాత్, బాలప్ప, అజీమ్, కొక్కు శ్రీనివాసులు, కొక్కు రాము తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఆన్ లైన్ నమోదు తప్పనిసరి నేరేడుగోమ్ము ఎస్సై నాగేంద్రబాబు

దేవరకొండ: నేరడుగోమ్ము: సెప్టెంబర్ 8 (సమయం ప్రతినిధి) : నేరడుగోమ్ము . సబ్ ఇన్స్పెక్టర్. నాగేంద్రబాబు మాట్లాడుతూ. నేరడుగోమ్ము మండలంలోని గ్రామపంచాయతీలలో వినాయక చవితి విగ్రహాలు పెట్టే వాళ్ళు పోలీస్ ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని. పెట్టిన దగ్గర నుండి ఏ రోజు నిమగ్నం చేస్తారో కూడా పోలీస్ శాఖ వారు తెలుపవలసిందిగా విజ్ఞప్తి చేశారు. డీజే లకు పర్మిషన్ లేదని ఎవరైనా అనుమతి లేకుండా డీజే లు పెడితే వాళ్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని అన్నారు

## అక్రమ బ్లాస్టింగ్ క్రషర్ మిషన్ ను నిలిపివేయాలి

- గద్వాల ఆర్డిఓ కి వినతిపత్రం
- తెలంగాణ రక్షణ సేన గద్వాల నియోజకవర్గ ఇన్ ఛార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్



గద్వాల:గట్టు మండలం సల్కాపురం గ్రామ సమీపంలో ఏర్పాటుచేసిన భారత్ మాల ప్రాజెక్టు క్రషర్ మిషన్ కంపెనీని తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్ ఛార్జ్ గొంగళ్ల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సల్కాపురం గ్రామ సమీపంలో ఉన్న క్రషర్ మిషన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం గద్వాల ఆర్డిఓ శ్రీనివాసులు కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.... క్రషర్ మిషన్ ఏర్పాటు చేయడం ద్వారా అనేకమంది శ్వాసకోస వ్యాధితో ప్రమాదానికి గురవుతున్నారని, ఆయా గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని తెలిపారు. నియమ నిబంధనలు పాటించకుండా క్రషర్ మిషన్ నిర్వాహకులు తీవ్ర నిర్లక్ష్యానికి పాల్పడుతూ ప్రజల ప్రాణాలకు ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు. క్రషర్ మిషన్ ఏర్పాటు చేయడం ద్వారా వ్యవసాయ పొలానికి రైతుల పొలాలో బోర్లు పూర్తిగా ఎండిపోయిన దుస్థితి నెలకొందని తెలిపారు. దీంతో అదే గ్రామానికి చెందిన రైతు చేసేదేమీ లేక పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయాన్ని గుర్తు చేశారు. క్రషర్ మిషన్ నిర్వాహకులు బ్లాస్టింగ్ చేయడం ద్వారా పక్క పొలాల్లో ఉన్న రైతులపై పెద్దపెద్ద రాళ్లు ఎగిరి పడడంతో అనేకమంది రైతులు ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. అక్రమ బ్లాస్టింగ్ ను నిలిపివేయాలని అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. చెట్టు ప్రక్క గ్రామాల ప్రజలను ఆర్థికంగా సామాజికంగా నష్టానికి గురి చేస్తున్న క్రషర్ మిషన్ యాజమాన్యంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్నా అధికారులు మాత్రం నమ్మకం నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ వ్యవహారం వెనుక రాజకీయ నాయకుల హస్తం ఉన్నదా? లేక అధికారుల హస్తం ఉన్నదా పూర్తిగా విచారణ జరిపించి అట్టి క్రషర్ మిషన్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ సైలెంట్ బ్లాస్టింగ్ చేయకుండా ప్రజల ప్రాణాలకు హాని కలిగిస్తున్నారని, ఎయిర్ క్వాలిటీ టెస్ట్ చేసి భూ పరీక్షలతో పాటు పొల్యూషన్ టెస్ట్ నిర్వహించాలనితెలిపారు. దీనికి ప్రత్యేకంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్ఓసి ఉండాలన్నారు. ఇచ్చిన అనుమతుల కంటే అదనంగా క్రషింగ్ కు పాల్పడుతూ పక్క రాష్ట్రాలకు ఇట్టి కంకరను అక్రమంగా తరలిస్తున్నారని మాట్లాడారు. ఈ విషయంపై గద్వాల ఆర్డిఓ గారి సమక్షంలో టాస్క్ ఫోర్స్ కమిటీ బృందంతో తనిఖీలు నిర్వహించి, అక్రమ బ్లాస్టింగ్ నిలిపివేయడమే కాక, రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకులు బుచ్చిబాబు, విష్ణు బలరాం నాయుడు, వెంకట్రాములు, మల్దకల్ అడవి ఆంజనేయులు జమ్మన్న,ఆశన్న,జగదీష్, లక్ష్మన్న, గొర్ల తిమ్మప్ప, మరియు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు:కాంగ్రెస్ ఆగ్రహం

**ఎమ్మెల్సీ తాత మధును వెంటనే సస్పెండ్ చేయాలి.. బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి**
**కీసర ప్రధాన చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన**



కీసర : సెప్టెంబర్ 8 వేకువ సమయం ప్రతినిధి: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కీసర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తాత మధు వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సీనియర్ శాసనసభ్యుడిగా, మృదుస్వభావిగా, నీతి నిజాయితీలకు కట్టుబడి పనిచేస్తున్న వ్యక్తిగా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై వ్యక్తిగతంగా, అనుచితంగా వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం మాత్రమే కాదని, శాసనసభ వ్యవస్థ గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను కించపరిచే చర్యగా వారు అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమే అయినప్పటికీ, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారిపై మాట్లాడేటప్పుడు ప్రతి ప్రజాప్రతినిధి హుందాతనం, సంయమనం పాటించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాజకీయ విమర్శలకు ఒక పరిమితి ఉండాలని, వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. తాత మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా శాసన మండలి గౌరవాన్ని కాపాడే విధంగా తాత మధుపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని, వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగం, శాసన వ్యవస్థలు ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని, వాటి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందన్నారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత విమర్శలకు దారితీయకుండా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించాలని సూచించారు. కీసరలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామిడి విజయ్‌రెడ్డి, తటాకం వెంకటేష్ శర్మ, శివలింగాల శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకుడు మచ్చాని జంగయ్య యాదవ్,పన్నాల బుచ్చిరెడ్డి, పిన్నింటి కృష్ణారెడ్డి, చిక్కుడు రమేష్ చర్లపల్లి కృష్ణారెడ్డి, కీసర మాజీ ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్ శర్మ , కలసికం వినోద్ కుమార్, యువ నాయకులు పోచబోయిన రాజు యాదవ్, మచ్చాని శ్రీశైలం యాదవ్, ముద్దం మల్లేష్ యాదవ్, దంతోజీ వెంకట్ చారి,మాల మహానాడు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పరశురాంతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

**-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి.**



వనపర్తి సమయం ప్రతినిధి : సెప్టెంబర్ 14వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన గోడ పోస్టర్‌ను, విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మట్టి వినాయక విగ్రహాలు పర్యావరణహితమైనవని, నీటిలో త్వరగా కరిగిపోవడం వల్ల జల కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేందుకు ముందుకు రావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ద్వారా 2,000 మట్టి వినాయక విగ్రహాలను త్వరలో పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలని సూచించారు.బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి బలవంతపు వివాహాల నిర్మూలనకు సంబంధించి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఎన్‌జీఓ) మరియు జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించి వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆవిష్కరించారు.బాల్య వివాహాలను అరికట్టేందుకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని, బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్యపరమైన సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బాలల హక్కులను కాపాడుతూ, బాలికలకు విద్య, భద్రత, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్త, నోడల్ అధికారి అనిల్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, కార్మిక శాఖ అధికారి రవి, తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 8 వేకువ సమయం ప్రతినిధి):మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కేసముద్రం మండలంలోని కోరుకొండపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, మధ్యాహ్న భోజన పథకం అమలు, మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం, తరగతి గదుల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు యూనిఫారాల పంపిణీని, పాఠ్యపుస్తకాలను సకాలంలో పంపిణీ చేయాలని అన్నారు.విద్యార్థులతో మాట్లాడి వారి చదువు సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన పెంపొందించేందుకు మెలకువలతో విద్యాబోధన అవసరమని అన్నారు. పాఠ్యపుస్తకాల్లోని అంశాలను బట్టీ పట్టించడం కాకుండా, నిత్యజీవిత ఉదాహరణలతో, కథలు, ఆటలతో బోధించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా, పరిశుభ్రంగా ఉండాలని, ప్రతి విద్యార్థికి పోషకాహారం అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలని ఎం ఈ ఓ కి సూచించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించి అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు, పోషకాహార నిల్వలు, నాణ్యత,మధ్యాహ్న భోజనం మరియు బాలామృతం పంపిణీ తీరు,పాఠశాల, అంగన్ వాడీ రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత, త్రాగునీటి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయి నుండే పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందాలని, అంగన్ వాడీ, ప్రాథమిక పాఠశాల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తక్కువ బరువు గల చిన్నారులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో స్థానిక తహశీల్దార్ వివేక్, మండల విద్యాధికారి యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వే పారదర్శకంగా, పక్కాగా సాగాలి: జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్,సెప్టెంబర్8(వేకువ సమయం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని చెరువుముందు తండాలో కొనసాగుతున్న సమగ్ర భూ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు నిర్వహిస్తున్న రోవర్ల వినియోగం, హద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను ఆమె నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సరిహద్దు వివాదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు నిర్వహించాలన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ రికార్డులను పక్కాగా, పారదర్శకంగా నమోదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వివేక్, సర్వేయర్లు, జి.పి ఓ నర్మద, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల అభ్యంతరాలను, ఆన్ లైన్ విధానాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 8 (వేకువ సమయం ప్రతినిధి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలోని ఓటర్ల అభ్యంతరాల ఫారాలను సిబ్బంది చేత బి.ఎల్.ఓ లాగిన్ లో ఆన్ లైన్‌లో నమోదు చేయించారు. ఆన్‌లైన్‌లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఓటర్ల దరఖాస్తులను పరిశీలించి వారి వివరాలను నమోదు చేయాలని అన్నారు. ఓటర్లు తమ పేర్ల నమోదు, తొలగింపు, సవరణలకు సంబంధించి అందజేసిన అభ్యంతరాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి, సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ అనేది పారదర్శకంగా, ఎలాంటి తప్పులు లేకుండా జరగాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం. వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలన్నారు. ఎవరి పేరు అనర్హంగా తొలగించబడకుండా, అర్హుల పేర్లు తప్పనిసరిగా చేర్చేలా చర్యలు తీసుకుంటున్నాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం, తహశీల్దార్ వివేక్ ఎం.పి.డి. ఓ అఫ్సర్ పాషా, బి.ఎల్.ఓ, జి. పి.ఓ లు పాల్గొన్నారు.



## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్,సెప్టెంబర్.8(వేకువ సమయం ప్రతినిధి): త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ దగ్గరలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లోని స్ట్రాంగ్‌రూమ్ సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఈవీఎం గోడౌన్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా కేటాయించిన విధులను సమయపాలనతో నిర్వహిస్తూ, గోడౌన్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. గోడౌన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అన్ని నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ తనిఖీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్ కుమార్, సంబంధిత అధికారులు మరియు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## న్యాయసేవా సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు



మహబూబాబాద్ సెప్టెంబర్ 8 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబాబాద్ పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి మంగళవారం సందర్శించారు. విచారణ ఎదుర కొంటున్న నిందితులను నేరుగా మాట్లాడి వారి కేసుల వివరాలు, బెయిల్ అప్లికేషన్లు, మరియు ట్రయల్ పురోగతిని తెలుసుకున్నారు. ముద్దాయిలతో మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల లేదా ఇతర కారణాల వల్ల సొంతంగా న్యాయవాదిని పెట్టుకోలేని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున ఉచితశీగా ప్రభుత్వ నాయవాదిని నియమిస్తామన్నారు. అనంతరం జైల్ లోని అన్ని బ్యారక్లను , వంటగది పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఖైదీల కోసం తయారు చేసిన ఆహారాన్ని, కూరలను స్వయంగా రుచి చూసి నాణ్యతను తనిఖీ చేశారు.జైలు అధికారులతో మాట్లాడి ఖైదీల ఆరోగ్యం, వారికి అందుతున్న ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. వంటగది పరిసరాలను చూసి అక్కడ ఎల్లప్పుడూ పూర్తి పరిశుభ్రత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. జైలు ఆసుపత్రిని తనిఖీ చేసి, అనారోగ్యంతో ఉన్న ఖైదీలకు సకాలంలో మందులు, సరైన వైద్య సదుపాయాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. జాతీయ న్యాయ సేవా సంస్థ రూపొందించిన స్పృహ పథకాన్ని వివరించారు.జైలు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. రాజ్ కృష్ణ, డ్యూటీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ద్రోణి ప్రభావం.. ఏపీలో రెండు రోజుల పాటు వర్షాలు

సమయం (ప్రతినిది): తెలంగాణ – రాయలసీమ – తమిళనాడు మీదుగా ద్రోణి ప్రభావ కొనసాగుతోందని ఏపీ వాతావరణ, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు అలర్ట్ జారీ చేశారు. ఏపీలో రేపు (బుధవారం) పలు జిల్లాలకు వర్ష హెచ్చరిక జారీ చేసినట్లు తెలిపారు. కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం ప్రభావం ఉందని వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో మోస్తరు వర్షాలు, పిడుగులతో కూడిన వర్షాలకు అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లా, కృష్ణా జిల్లా, ఎన్టీఆర్ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వివరించారు. గుంటూరు జిల్లా , బాపట్ల జిల్లా , పల్నాడు జిల్లా, మార్కాపురంలో వర్ష సూచనలు ఉంటాయని అన్నారు. నెల్లూరు జిల్లా, చిత్తూరు జిల్లా, తిరుపతి జిల్లాల్లో కూడా వర్షాలు పడే ఛాన్స్ ఉందని తెలిపారు. ఆకస్మిక వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 52.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందని తెలిపారు. పెరికగూడెంలో 31.3 మిల్లీమీటర్ల వర్షం నమోదవుతుందని, పెంటపాడులో 27.6 మిల్లీమీటర్ల వర్షపాతం, చందర్లపాడు, పంద్రపాడులో 24 మిల్లీమీటర్ల చొప్పున వర్ష పాతం నమోదవుతుందని అధికారులు పేర్కొన్నారు.

## గోధుమకుంటలో ప్రభుత్వ భూములకు రక్షణ ఏది?

వేకువ సమయం సెప్టెంబర్ 8 కీసర ప్రతినిధి : మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కీసర మండలం గోధుమకుంట గ్రామంలోని సర్వే నంబర్ 4లో ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన అధికారుల కళ్లముందే నిర్మాణాలు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఎవరు ఇచ్చారు? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.అధికారుల దృష్టికి విషయం వెళ్లినప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సర్వే నంబర్ 4లోని భూమి వాస్తవంగా ప్రభుత్వ భూమేనా? అక్కడ నిర్మిస్తున్న నిర్మాణాలకు చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై రెవెన్యూ, పంచాయతీ, టౌన్‌ప్లానింగ్ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.భూమి ప్రభుత్వానికి చెందినదిగా నిర్ధారణ అయితే అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి, ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన అధికారులే మౌనం వహిస్తే.. ప్రభుత్వ ఆస్తులను కాపాడేది ఎవరు? ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి? అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వాస్తవాలను బహిర్గతం చేయాలని కోరుతున్నారు.

# దేవరకొండలో 5000ల బైకులతో కాంగ్రెస్ ప్రజా వికాస ర్యాలీ





**దేవరకొండ: సెప్టెంబర్ 8 (సమయం ప్రతినిధి) :** దేవరకొండ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా వికాస ర్యాలీ విజయవంతంగా జరిగింది. దేవరకొండ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (మార్కెట్ యార్డు) నుంచి బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన భారీ ర్యాలీలో 5 వేల బైకులు, 11 వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, ప్రజలులి పాల్గొన్నారు. భారీ జనసందోహంతో దేవరకొండ పట్టణం కాంగ్రెస్ శ్రేణుల నినాదాలతో మార్మోగింది.

**ఇది ర్యాలీ కాదు.. కాంగ్రెస్ అభివృద్ధికి ప్రజల మద్దతు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. "దేవరకొండలో కనిపించిన ఈ జనసంద్రం కాంగ్రెస్ ప్రజా పాలనకు ప్రజలు ఇచ్చిన మద్దతుకు నిదర్శనం. ఇది కేవలం బైక్ ర్యాలీ కాదు.. వెయ్యి రోజుల పాలనలో చేసిన అభివృద్ధికి ప్రజల ముందుంచిన అభివృద్ధి నివేదిక. మా దగ్గర మాటలు మాత్రమే కాదు.. పనులు, గణాంకాలు, రికార్డులు ఉన్నాయి" అన్నారు.

**రైతు సంక్షేమానికి పెద్దపీట**

దేవరకొండ నియోజకవర్గంలో రూ.369 కోట్ల రైతు రుణమాఫీలిజరిగిందని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించామని చెప్పారు. ఎస్ ఎల్ బి సి. డిండి. లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేసి చివరి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం నియోజకవర్గంలో 15 వేల కొత్త రేషన్ కార్డులు అందించామని, ప్రతి యూనిట్‌కు నెలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. అలాగే 32,127 కుటుంబాలకు గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోందని, దాదాపు 3 వేల ఇందిరమ్మ ఇళ్లులిపూర్తయి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

**మహిళలకు ఉచిత ప్రయాణం..**

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత RTC ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, దేవరకొండ డిపో పరిధిలో ఇప్పటివరకు రూ.156 కోట్లు RTCకి చెల్లించారని తెలిపారు.

**252 కిలోమీటర్ల రోడ్లు.. రూ.422 కోట్ల అభివృద్ధి పనులు**

R&B ద్వారా 137 కిలోమీటర్లకు రూ.272 కోట్లు, పంచాయతీరాజ్ ద్వారా 115 కిలోమీటర్లకు రూ.150 కోట్లు.. మొత్తంగా 252 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.422 కోట్ల పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గత బిఆర్ఎస్ పాలనపై బాలు నాయక్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు ప్రజలకు చేసిన పనులపై సమాధానం చెప్పాలి. కేసీఆర్ ప్రజల మధ్య ఉండాల్సింది పోయి ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. కేటీఆర్, హరీష్ రావులు గాలి మాటలు మాట్లాడుతున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు" అని అన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఏమైంది? ప్రతి ఇంటికి ఉద్యోగం ఏమైంది? డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఎక్కడ గతంలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారు అని ప్రశ్నించారు.

**చేసిన పనికి కీర్తి రావాలి.. చేయని పనికి కీర్తి అడగొద్దు**

ఎవరి హయాంలో ఏ పని జరిగిందో జీవోలు, శాంక్షన్లు, రికార్డులు చెబుతాయి. మాటలతో చరిత్ర మార్చలేరు. చేసిన పనికి కీర్తి రావాలి.. చేయని పనికి కీర్తి అడగకూడదు" అని బాలు నాయక్ అన్నారు. వెయ్యి రోజుల పాలన అంటే క్యాలెండర్‌లో ఒక సంఖ్య కాదు.. ప్రజల జీవితాల్లో కనిపిస్తున్న మార్పు. గతాన్ని రికార్డులతో చూద్దాం.. వర్తమానాన్ని పనులతో చూద్దాం.. భవిష్యత్తును ప్రణాళికతో నిర్మిద్దాం. అభివృద్ధి కాగితాలపై కాదు.. ప్రజల జీవితాల్లో కనిపించాలి అని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్పష్టం చేశారు

# జడ్చర్ల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష



జడ్చర్ల సెప్టెంబర్ 8, సమయం ప్రతినిధి: జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) మధుసూదన్ నాయక్ మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పౌర సేవల పురోగతిపై సమగ్రంగా ఆరా తీశారు. ఆస్తి పన్ను వసూళ్లు, భవన నిర్మాణ అనుమతులు, ఇంజనీరింగ్, పారిశుధ్య పనులు, ట్రేడ్ లైసెన్సులు, ప్లాంటేషన్, లైవ్ ఆథెంటికేషన్, ఇందిరమ్మ ఇళ్లు, షాపుల అద్దెలు, పారిశుధ్య కార్మికుల హాజరు, ట్యాప్ కలెక్షన్ల యాక్షన్ ప్లాన్, ప్రజావాణి ఫిర్యాదులపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఇంటింటికీ తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరాయంగా నీటి సరఫరా అందించాలని, పన్నుల వసూళ్లను వేగవంతం చేయడంతో పాటు, మౌలిక వసతులు, పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధ ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, ప్రభుత్వ పథకాలు, మున్సిపల్ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

# రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా యాత్రకు జడ్చర్లలో ఘన స్వాగతం



జడ్చర్ల సెప్టెంబర్ 8, సమయం ప్రతినిధి: దేశంలో బీజేపీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలనే ఆకాంక్షతో చేపట్టిన 'రాగా ఫర్ రైజ్ ఆఫ్ ఇండియా' పాదయాత్ర జడ్చర్లకు చేరుకుంది. నెల్లూరుకు చెందిన హైకోర్టు న్యాయవాది వెంకటేశ్వర్లు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన ఈ పాదయాత్రకు జడ్చర్ల కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో కొనసాగుతున్న ఈ యాత్రకు సంఘీభావంగా జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్రలో పాల్గొన్నారు. జడ్చర్ల టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంశీకృష్ణ చారి ఆధ్వర్యంలో నాయకులు యాత్రికుడికి స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మీనాజోద్దీన్, బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్, మాజీ ఎంపీపీ నిత్యానందం, మాజీ సర్పంచ్ బుక్క వెంకటేశం, బుర్ల వెంకటయ్య, మాజీ కౌన్సిలర్ కుమ్మరి రాజు, రమేష్, మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకుడు బెంజిమెన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మహిళా నాయకురాలు సంధ్య, తుంగ రఘు, చాగంటి రఘు, క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు సన్నీ, భరత్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## భాస్కర్ (భానుప్రసాద్) మృతికి సంతాపం

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 9: వినాయక విగ్రహాల తరలింపులో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలిపెద్దకొత్తపల్లి మండలం కల్వకోలు గ్రామానికి చెందిన యువకుడు భానుప్రసాద్ (25) హైదరాబాద్‌లో బొలెరో వాహనం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో, ఘట్‌కేసర్‌లో వినాయక విగ్రహాన్ని తరలిస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందడం అత్యంత విచారకరం. కష్టపడి బతికే ఒక యువకుడి ప్రాణం ఇలా అనూహ్య రీతిలో కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటు. అతని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, శోకసంతప్త కుటుంబ సభ్యులకు మా గాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము. ఈ విషాద సంఘటన నేపథ్యంలో, రాబోయే రోజుల్లో ఇలాంటి ప్రమాదాలు మరెవరికీ జరగకుండా వినాయక విగ్రహాల తరలింపులో ఉత్సవ కమిటీలు, వాహన డ్రైవర్లు తీసుకోవాల్సిన ముఖ్యమైన భద్రతా జాగ్రత్తలు:వైర్ల పట్ల అప్రమత్తత: విగ్రహాలను వాహనాలలో తీసుకెళ్లే సమయంలో దారి పొడవునా ఉండే విద్యుత్ వైర్లు, కేబుల్స్ తగలకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎత్తు విషయంలో జాగ్రత్త: వాహనంపై విగ్రహాన్ని ఉంచినప్పుడు దాని మొత్తం ఎత్తు ఎంత ఉందో ముందే అంచనా వేసుకుని, తక్కువ ఎత్తులో వైర్లు ఉన్న మార్గాల గుండా వెళ్లకుండా ప్రత్యామ్నాయ దారులను ఎంచుకోవాలి. విద్యుత్ శాఖ సమన్వయం: వీలైతే విగ్రహాల రవాణా లేదా నిమజ్జన ఊరేగింపుల సమయంలో స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు ముందే సమాచారం అందించి సహాయం తీసుకోవాలి.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085